

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 15 సంచిక : 11 జూలై 2010

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


జిన్నూరు ......... 12-04-2010

జిన్నూరు ......... 09-06-2010



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-04-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మాణిక్యవాచకర్ గొప్ప శివభక్తుడు. ఆయన తిరువాచకం అనే పుస్తకాన్ని వ్రాసారు. తమిళనాడులో శివభక్తులు అందరూ దానిని పారాయణం చేస్తారు. అందులో అంతా శివుడిమీద స్తోత్రం ఉంటుంది. మాణిక్యవాచకర్ ఎన్నో జన్మల నుండి శివభక్తుడు. ఆయన మంత్రి పదవి చేసాడు. వీడికి మంత్రి పదవి ఏమిటి, రాజకీయాలు ఏమిటి, మరల మాయలో పడుతున్నాడు అని ఏవో గొడవలు కల్పించి, మంత్రి పదవిని ఊడగొట్టి, పూర్వజన్మల స్మృతిని తీసుకొనివచ్చి ఆయన మీద భక్తి, ప్రేమ కలుగజేసుకొంటాడు శివుడు. మాణిక్యవాచకర్ శరీరం శవం అవ్వలేదు. కొన్ని వందల మంది చూస్తు ఉండగా ఆయన నటరాజ్‌లో ఐక్యమైపోయాడు. రమణమహర్షి గారికి ఆయన కవిత్వం అంటే బాగా ఇష్టం. ఎవరైనా నేను కవిత్వం వ్రాస్తానుఅంటే మీరు మాణిక్యవాచకర్‌లాగ కవిత్వం రాయగలరా అనేవారు భగవాన్. అంటే కవిత్వం పేరు చెప్పేటప్పటికి మాణిక్యవాచకర్ గుర్తుకు వస్తున్నాడు.

మురుగునార్‌కు భగవాన్ గొడవ తప్పించి ఇంక ఏ గొడవ లేదు. భగవాన్ నామం, భగవాన్ రూపం, ఆయన చెప్పినమాట తప్పించి ఇంక ఏ విషయాలు మురుగునార్‌కు అక్కరలేదు. మురుగునార్ గొప్ప పండితుడు. ఆయన మాటల సందర్భంలో నాతో ఏమని చెప్పారు అంటే నేను అరుణాచలం జ్ఞానంకోసం రాలేదు, భక్తికోసం రాలేదు. అరుణాచలంలో రమణమహర్షిగారు ఉన్నారు, ఆయన మహాత్ముడు

అని మా మామగారు నాతో చెప్పారు. ఆ మాటలు విని ఆయనను చూసి వెళదామని ఇక్కడకు వచ్చాను. నేను భగవాన్ దగ్గరకు భక్తుడిగా రాలేదు, పండితుడిగా వచ్చాను. పండితుడిగా వచ్చిన నన్ను ఆత్మజ్ఞానంతో అలంకరించారు, ఆత్మానుభవాన్ని నాకు ప్రసాదించారు. జ్ఞానం విలువకూడా నాకు తెలియదు. ఆయన నన్ను జ్ఞానంతో అనుగ్రహించాక జ్ఞానం విలువ అప్పుడు నాకు తెలిసింది అని మురుగునార్ నాతో చెప్పారు.

తిరువాచకంలో మాణిక్యవాచకర్ ఏమన్నాడు అంటే నేను ఎందుకూ పనికిరానివాడను. ఈ ఎందుకు పనికిరానివాడిని పల్లకీలో కూర్చోబెట్టి దేశం అంతా తిప్పుతున్నావు ఏమిటి శివా అన్నాడు. అంటే ఎందుకు పనికిరానివాడిని కవిత్వంతో, జ్ఞానంతో అనుగ్రహించావు నువ్వు అని చెప్పటం. ఈ పనికిరానివాడిని పల్లకీలో ఊరేగిస్తావా అన్నమాటకు ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఆడించేవాడు ఆయన, ఆడేవాళ్లము మనము. వాడు ఎక్కడికి తోలుకెళితే అక్కడకు వెళుతున్నాము. కాని ఇదంతా మన తెలివితేటలు అనుకొంటున్నాము. కారును భీమవరం తోలుకొనివెళ్లాలి అంటే తనంతట తాను భీమవరం వెళుతుందా, దానికి డ్రైవర్ ఉండాలి. అలాగే ఈ శరీరాలు అనే కార్లను నడిపేవాడు మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు. ప్రారబ్దాన్నిబట్టి ఈ శరీరాలను ఎక్కడికి తోలుకొనివెళ్లాలంటే ఆయన అక్కడకు తీసుకొనిపోతాడు. అది మనకు తెలియక జరిగేది అంతా మన తెలివితేటలు అనుకొంటాము. ఈ దేహము నువ్వుకాదని తెలుసుకొనేవరకూ నిన్ను ప్రతీజన్మలోను ఎక్కడో ఒకచోటుకి తోలుకొనిపోతాడు. ఈశ్వరుడు ఎక్కడకు తోలుకొనివెళితే అక్కడకు వెళ్లి ఆయన ఏ దేహం ఇస్తే దానిని మనం మోయవలసిందే. మీరు తెలివైనవారము అనుకొన్నా, తెలివితక్కువ వారము అనుకొన్నా జరిగేది అంతే. ఇక్కడ మాణిక్యవాచకర్ ఏమంటున్నారు అంటే పుట్టినది మొదలు చనిపోయేవరకు మాకు బయటకు చూడటం తప్ప ఇంకోపనిలేదు, రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవటం శరీరం, మనస్సు బాడిచేసుకోవటం తప్ప ఇంక మాకు వేరేపనిలేదు. మమ్మల్ని మాయచేయటానికే బయటచూపు పెట్టావు. ఇలా బయట చూపుకు అలవాటు పడిపాడైపోతున్న మాకు లోచూపు నేర్పవయ్యా శివా అంటున్నాడు. మాకు లోచూపు అలవాటుచేసి, మాలో ఉన్న దుర్గుణాలను తెలియజేసి, వాటిని తొలగించుకొనే శక్తిని ప్రసాదించు అని ప్రార్థిస్తున్నాడు.

మీరు శివనామం చేసినా, రామనామం చేసినా, కృష్ణనామం చేసినా ఏదో నామం చేసి ఇంకా ఫలితం రాలేదు ఏమిటి అని అనుకోకూడదు. మనం పిండి నానబెడతాము, ఆ

పిండి నీటిలో కలవాలి కదా. అలాగే మీరు నామం చేయటం మొదలుపెట్టాక అది మీ హృదయంలో కరగాలి. అలాగ నామం చేయగా చేయగా దాని ఫలితం మీకు వస్తుంది. అంతేగాని ఇవాళ నామం చేసి రేపు ఇంకా జ్ఞానం రాలేదు ఏమిటి అని ఎదురుచూడ కూడదు. చిరకాలం చేస్తూ ఉండాలి, చేసేది ప్రేమతో చేయాలి, దాని ఫలితం ఎప్పడో వస్తుంది. శరీరాన్ని అందరూ చాలా శుభ్రంగా ఉంచుకొంటున్నారు. స్నానాలు చేస్తున్నారు, పౌడర్లు రాసుకొంటున్నారు, మంచి మంచి బట్టలు వేసుకొంటున్నారు, మంచి మంచి తిండ్లు తింటున్నారు బాగానే ఉంది కాని ఈ శరీరంలో ఉన్న ప్రాణం పోయిన తరువాత దీనిని ఎవరూ గౌరవించరు అది మాత్రం మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఏ శరీరాన్ని బాగా చూసుకోవటం కోసం మీరు జీవితం పొడుగునా కష్టపడుతున్నారో అందులో ఉన్న ప్రాణం పోయిన తరువాత దానిని ఎవరూ పట్టించుకోరు, బయటకు ఈడ్చేస్తారు, మీ ఇంట్లోనివారు కూడా దానిని గౌరవించరు, చివరకు శరీరానికి జరిగే మర్యాద అంతే. భక్తులు అందరూ ఆలోచించవలసిన విషయం ఏమిటి అంటే అసలు ఈ శరీరాన్ని దేనికి ఉపయోగిస్తున్నాము? భోగాలు అనుభవించటానికి ఉపయోగిస్తున్నామా, జ్ఞానం సంపాదించటానికి ఉపయోగిస్తున్నామా అని ఏరోజుకారోజు పరిశీలన చేసుకోవాలి. శరీరం బతకటానికి కొంచెం అన్నంతినాలి, మనో నిగ్రహంకోసం, శాంతికోసం సజ్జనసాంగత్యం చెయ్యాలి. శాంతి అవసరమే, ఆరోగ్యం అవసరమే కాని అవే గమ్యంకాదు. నీ హృదయం యొక్క లోతులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను తెలుసుకోవటానికి నీ మనోదేహములను ఉపయోగించుకోవాలి. స్వప్నంలో ఉన్న మనిషి అది నిజమే అనుకొంటాడు కాని అది స్వప్నం అని అనుకోడు. అలాగే నువ్వు హృదయంలో ఉన్న పరమాత్మను తెలుసుకొనే వరకూ ఈ చావులు, పుట్టుకలు, గౌరవాలు అన్నీ నిజమే అనుకొంటావు కాని అవి నూటికినూరు పాళ్ళు అసత్యాలు అని నీ బుద్ధికి గోచరించదు.

మన మనస్సులో ఎన్ని వికారాలు ఉన్నాయో మనకు తెలుస్తూ ఉంటుంది. ఆ వికారాలలో నుండి బయటకు రాకుండా నువ్వు జననమరణ చక్రంలో నుండి బయటకు వచ్చే అవకాశం లేదు. వికారాలలో నుండి బయటకు వచ్చేవరకు నీకు శరీరాలు రావటం ఆగవు, శరీరం వస్తే ప్రపంచం వచ్చేస్తుంది, అక్కడనుండి రాగద్వేషములు, కోపం, అసూయ అన్నీ వచ్చేస్తాయి. అందుచేత నువ్వు శరీరాన్ని కేవలం భోగాలకు ఉపయోగించకుండా నీ లోపలఉన్న అంతర్యామిని తెలుసుకోవటానికి ఉపయోగిస్తూ ఉంటే నీ మనస్సులో ఉన్న వికారాలు అన్నీ

ఏదో రోజున కాలి బూడిద అయిపోతాయి. అదీ సత్యాన్వేషణలో ఉన్న విశేషం. లోపలఉన్న శివుడే జ్ఞానం, ఆయనే సత్యం, ఆయనే ఆనందం, ఆయనే సుఖం, అన్నీ ఆయనే. అక్కడకు చేరుకునేవరకు నీకు శాంతిలేదు. అందరికీ కళ్ళు అంటే ఇష్టం, కళ్ళులేకపోతే ప్రపంచమే లేదుకదా. ఏసు ఏమన్నాడు అంటే నీ కళ్ళు నీ లోపల ఉన్న కామకాంక్షను పెంచుతూ ఉంటే, నీ మనస్సును పాడుచేస్తూ ఉంటే వాటిని పీకి అవతల పాడెయ్యి అని చెప్పాడు. అప్పుడు నువ్వు ఈ జన్మలోమటుకు గుడ్డివాడుగా ఉంటావు. నీ కళ్ళు లోపల ఉన్న జీవుడిని, నీ మనస్సును పాడుచేస్తూ ఉంటే నువ్వు శాశ్వతంగా నరకంలోనికి పోతావు. అందుచేత నీ కళ్ళు జీవుడిని అపవిత్రం చేస్తూ ఉంటే వాటిని పీకి ఆవలపాడెయ్యి అంటాడు. బుద్ధుడినేత్రాలు పరమపవిత్ర మైనవి. ఏమి సాధన చేయనక్కరలేకుండా ఆయనను చూసి కొంతమంది జ్ఞానం పొందిన వారు ఉన్నారు, ఆయన అంత పరమపవిత్రుడు. నువ్వు చీకటిలో నుండి వెలుతురులోనికి, అశాంతిలోనుండి శాంతిలోనికి రావాలి. అదే ఆయన లక్ష్యం తప్ప వేరే లక్ష్యం బుద్ధుడికి లేదు. మాణిక్యవాచకర్ శివుడితో అంటాడు నువ్వు పరోపకారివే. ప్రజలను రక్షించటానికి విషం తాగావు. నువ్వేదో ఇస్తావు, మేము ఏదో పుచ్చుకొంటాము, అది కాదు. ఈ లోకం ఎంత నిజమో, ఈ శరీరం ఎంత నిజమో నువ్వు ఇచ్చేది అంతే నిజం. ఈ మాయ గొడవలు మాకు ఎందుకు. ఈ చిల్లర గొడవలలో మమ్మల్ని బోల్తా కొట్టించవద్దు. నీ స్వరూపాన్ని పొందేటట్లు మమ్మల్ని అనుగ్రహించు అన్నాడు. ఎలుకల బోనులో మాంసం పెడతారు. ఎలుక తింటుందని ఆ మాంసం పెట్టటంలేదు. మాంసం తినటానికి ఎలుక వస్తే ఆ బోనులో పడిపోతుంది. అలాగే ప్రపంచంలో అనేక ఆకర్షణలు పెట్టావు. ఈ మేత చాలా బాగుంది అని మేము అనుకొంటున్నాము. ఏదో ఆకర్షణలో పడిపోతున్నాము. ఇవి అన్నీ నువ్వు పెట్టిన బోనులు అని మాకు తెలియటంలేదు. అది తెలుసుకొనే వివేకాన్ని కూడా నువ్వే మాకు ప్రసాదించు. వాటిలో నుండి మమ్మల్ని విడుదలచేసి, జ్ఞానంతో మమ్మల్ని అలంకరించు అని చెపుతున్నాడు.

అలవాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండండి. అలవాట్లు నేర్చుకోవటం తేలికేగాని వాటిలో నుండి బయటకు రావటం చాలా కష్టం. పూర్వం రాజులకు వేట అలవాటు ఉండేది. రాముడికి కూడా ఆ అలవాటు ఉండేది. అరణ్యవాసంలో ఉన్నప్పుడు జంతువులను వేటాడేవాడు. ఒకరోజున సీతమ్మ రాముడితో అంటుంది మీకు వేటాడటం సరదా. పాపం జంతువులు చనిపోతున్నాయి. ఇదేమి అలవాటు అని అడిగింది. నువ్వు చెప్పింది యదార్థమే, నేను

చేసేది పొరపాటే అంటాడు రాముడు. సీతమ్మ చెప్పాక ఆ అలవాటులోనుండి బయటకు రావటానికి రాముడికి మూడు నెలలు పట్టింది. మధ్యమధ్యలో వేటాడుతూనే ఉండేవాడు. సీతమ్మ మాట జ్ఞాపకం వచ్చి మానేసాడు. అలా పూర్తిగా మానటానికి మూడు నెలలు పట్టింది. రాముడికే అంత టైముపడితే ఇంక మనమాట ఏమిటి, మనకు ఎన్ని జన్మలు పడుతుంది. అందుచేత అలవాట్ల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. ఈశ్వరానుగ్రహం లేకుండా ఒక చిన్న అలవాటులో నుండి కూడా మనం బయటకు రాలేము. నేను ఉద్యోగం మానేసి మీ సమక్షంలో గడపాలి అనుకొంటున్నాను అని ఒకరు భగవాన్‌తో అంటే ఆయన ఏమన్నారు అంటే నేను నీకంటే భిన్నంగా లేను, హృదయంలో నువ్వు నేను ఒకటిగానే ఉన్నాము, వూరికే శరీరాలు తేడా, మనస్సులు తేడా గాని నువ్వు నేను ఒక్కటే, ఈ విషయం గ్రహించటానికి నువ్వు ఉద్యోగానికి రాజీనామా చేయవలసిన పనిలేదు. నువ్వు చేసుకొనే పని శ్రద్ధగా చేసుకో. భగవంతుడు ఒకో దేహానికి ఒకో పనిని కేటాయిస్తాడు. నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఆ పని చెయ్యాలి. నీ దేహానికి భగవంతుడు ఏ పని అయితే కేటాయించాడో ఆ పని చేసుకొంటూ నువ్వు జ్ఞానాన్ని పొందవచ్చు. ఆ పని మానేసినంత మాత్రంచేత నీకు జ్ఞానం రాదు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు, అంతటా ఉన్నాడు. అందుచేత నువ్వు చేసే పని శ్రద్ధగా చేసుకొంటూ ఆయనను పొందటానికి ప్రయత్నం చెయ్యి.

సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటంకాదు, కుటుంబాన్ని విడిచిపెట్టి పారిపోవటం కాదు. ఈ ప్రపంచానికి ఏ కోరికలు అయితే నిన్ను బంధిస్తున్నాయో, నీ మనస్సును ఏ ఆకర్షణలు అయితే బయటకు లాగుతున్నాయో, వాటిని తగ్గించుకోవటం, మమకారాన్ని తగ్గించుకోవటం సన్యాసం అంతేగాని బట్టలు మార్చుకొంటే సన్యాసం అయిపోదు. వీతరాగభయక్రోధ వీటిని విడిచిపెట్టమని పరమాత్మ ఎందుకు చెపుతున్నాడు అంటే అవి మీలోపల ఉంటే మీరు ఆత్మజ్ఞానం పొందటానికి అవి అడ్డు వస్తాయి, వాటివలన మీకు అశాంతి వస్తుంది, దుఃఖం వస్తుంది, మరణానంతరం మీరు చీకటిలోకాలకు వెళతారు అందుచేత వాటిని విడిచిపెట్టండి అని చెప్పాడు.

భగవాన్ చెప్పిన రహస్యం ఏమిటి అంటే నీ దేహప్రారబ్దంలో ఏది ఉంటే అది అలా జరుగుతూ ఉంటుంది. మంచి సంఘటనలు జరిగినప్పుడు సంతోషపడవద్దు, చెడు సంఘటనలు జరిగినప్పుడు దుఃఖపడవద్దు. అదీ వికారమే, ఇదీ వికారమే. ప్రారబ్దంలో

ఉన్నప్పుడు ఆ సంఘటనలు అలా జరిగిపోతూ ఉంటాయి, వాటిని అలా జరగనియ్యి, నీ మనస్సును మటుకు అంతర్ముఖం చేసి ఉంచు. బయట గొడవలు ఏమీ నీకు అశాంతిని, దుఃఖాన్ని తీసుకొనిరావు. ప్రపంచంలో ఎవరికీ లేని చెడు ప్రారబ్దం నీకు ఉన్నా, నీ మనస్సును అంతర్ముఖం చేస్తే ఆ ప్రారబ్దం నిన్ను ముట్టుకోదు. అది రమణుడు చెప్పిన జ్ఞాన వైభవం. ప్రారబ్దం అనుభవించాలి, అనుభవించాలి అంటారు కదా. అలా అనుభవించేవాడిని శరీరం ఉండగానే తీసేస్తున్నాడు, అది భక్తులకు ఆయన చేసిన మేలు. ఈ శరీరం ఉండగానే మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొనిపోతూ ఉంటే అంతకంటే మీకు ఏమి కావాలి. మీకు బాహ్యంగా అన్నీ ఉన్నాయి. కాని మీకు దుఃఖం వస్తోంది, అశాంతి వస్తోంది అనుకో ఏమిటి వాటివలన ప్రయోజనం, వాటిని ఏమి చేసుకొంటారు. భగవాన్ చేసే సహాయం ఏమిటి అంటే మీ ప్రారబ్దం చెడ్డగా ఉన్నా మిమ్మల్ని దుఃఖ స్పర్శలేని స్థితికి, అంతలోయలలోనికి తీసుకొనిపోతున్నాడు. ఈ ప్రపంచం కాని, మనస్సుకాని, చావుపుట్టుకలు కాని మిమ్మల్ని ముట్టుకోలేనంత లోయలలోనికి మిమ్మల్ని తీసుకొని పోతున్నాడు. శరీరం ఉండగానే అక్కడకు మోసుకొనిపోతున్నాడు. నీకు సుఖం కావాలంటే, ఆనందంకావాలంటే, శాంతి కావాలంటే బయట ఎక్కడా లేదు, నీ హృదయం యొక్క లోయలలోనికి దిగటమే. ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో అక్కడకు నీ మనస్సు జారుతూ ఉంటే నీ శరీరానికి సంబంధించిన చావు కూడా నిన్ను ముట్టుకోదు. శరీరం పోయేటప్పుడు శరీరం పోతోంది అని కూడా నీకు తెలియదు. అది అమృతానుభవం అది ఇప్పుడే ఈ శరీరంలో ఉండగానే మీకు ప్రసాదిస్తాను అంటున్నాడు, వాడు గురువు.

మీకు సుఖపడాలని ఉందా జరిగిపోయిన గొడవలు అన్నీ మరిచిపోండి. భవిష్యత్ గొడవల గురించి వర్రీ పడకండి. ఏ రోజున ఎలా జరగాలో అలా జరిగిపోతూ ఉంటుంది. దాని గురించి ఆలోచించి ఇప్పటినుండి వర్రీ పడకండి. జరిగిపోయిన గొడవలు మరిచిపోండి, భవిష్యత్ గొడవ వదిలేయండి. ఇప్పుడు మీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేసుకోండి. అదీ రమణబోధ. మీ మనస్సును ఇక్కడపెట్టి ఏరోజు పని ఆరోజు జాగ్రత్తగా చేసుకోండి. వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అని నీ చేతిలో ఉన్న పనిని వదులుకోనక్కరలేదు. నిన్నటిగొడవ వద్దు, రేపటిగొడవవద్దు. డీపెన్ అవ్వటానికి ప్రయత్నం చేయండి. మిమ్మల్ని మీరు తెలుసుకోవటం మానేసి, ఆ లోకం గురించి, ఈ లోకం గురించి, చనిపోయిన తరువాత ఏమౌతాము అని ఇలా ఆలోచించటం మొదలుపెడితే అది మీలో

ఉన్న మాయ లక్షణం. అంటే మిమ్మల్ని మీరు తెలుసుకోకుండా మాయ అడ్డు వస్తోంది.

ఈశ్వరసంకల్పం బలీయమైనది. అందుచేత ఏమైపోతాను అని నువ్వు కంగారు పడకు. ఏ శక్తి అయితే నీ శరీరాన్ని ఈ భూమి మీదకు తీసుకొని వచ్చిందో నిన్ను కాపాడే బాధ్యత కూడా దానిదే. నువ్వు వారితోటి, వీరితోటి రాజీపడటం నేర్చుకొన్నావు కాని ఈశ్వరుడితోటి రాజీపడటం నేర్చుకోలేదు. భగవంతుడితోటి రాజీపడటం నేర్చుకో. నీ జీవితం సుఖమయమౌతుంది. నీ శరీరం పుట్టింది. చనిపోయవరకు భోగం అనుభవించటం తప్ప ఈ శరీరానికి ఇంకో పని లేదు. జ్ఞానం సంపాదించటానికి, సజ్జనసాంగత్యం చేయటానికి ఈ శరీరం పనికిరాదా? ఎంతసేపు ఈ శరీరంతో భోగం అనుభవించటమేనా అని మాణిక్యవాచకర్ తిట్టిపోస్తాడు. గీతలో ఏమన్నాడు అంటే తాబేలు దానికి ఏదైనా ప్రమాదం వస్తోంది అంటే దాని ఇంద్రియాలను లోపలకు లాగేసుకొంటుంది. అలాగే మీరు విషయాలలో నుండి ఇంద్రియాలను లోపలకు లాగేసుకోవాలి అప్పడు గాని మీకు జ్ఞానం స్థిరపడదు అని పరమాత్మ చెప్పాడు. ఈశ్వరుని దయ వలన ఒకోసారి హృదయంలో ఉన్న తీపి మనకు తెలుస్తుంది. ఈగలు మిఠాయి మీద ఎలా వాలతాయో అలాగే హృదయంలో ఎక్కడైతే తీపి దొరికిందో మనస్సు అక్కడ వాలుతుంది. కాని వాసనలు ఏమి చేస్తాయి అంటే దానిని బయటకు లాగేస్తాయి. పెద్దల సహవాసం వలన, మన కృషివలన, శివుడి అనుగ్రహం వలన మీకు కొంత జ్ఞానం కలిగినా పూర్తిగా వాసనాక్షయం అయితేగాని అది నిలబడదు.

వాసనలు రకరకాలుగా ఉంటాయి. సాయిబాబాగారు బీడీకాల్చేవారు. బాబాగారు బీడీ కాల్చినా అది బంధించే వాసనకాదు. రేపు బీడీలు దొరకవు అనుకోండి మానేస్తారు. ఆయనకు ఏమీ అనిపించదు. బీడీ తాలూక వాసన కూడా వెంటనే పోతుంది. బాబా బీడీకాలుస్తున్నారు అని మనం నేర్చుకోకూడదు. అది మనలను బంధిస్తుంది, వారిని బంధించదు. కొంతమందికి ఆ దేహప్రారబ్ధాన్నిబట్టి కొన్ని వాసనలు వస్తాయి కాని లోపల ఉన్న జ్ఞానానికి అవి భంగం కాదు, ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అది వస్తుంది, పోతుంది. వాటివలన ప్రమాదం లేదు. బంధించే వాసనల విషయంలో మటుకు బహుజాగ్రత్తగా ఉండి వాటిలో నుండి బయటకు రావాలి. బుద్ధుడు జీవకోటిని అపూర్వంగా ప్రేమించాడు. ఆ ప్రేమ అభౌతికం, అలౌకికం. సమాజంలో అటువంటి ప్రేమను చూడము. అది మానవ ప్రేమకాదు, దైవప్రేమ. మీ జీవితంలో అటువంటి ప్రేమను చూసి ఉండరు. అటువంటి ప్రేమ ఒక ప్రవాహంలాగ

వచ్చేటప్పటికి మన ప్రయత్నంతో సంబంధం లేకుండా మనలో ఉన్న అజ్ఞానం కొట్టుకొని పోతుంది, వాడు బుద్ధుడు. ఇప్పుడు నువ్వు దేహానికి, మనస్సుకు పరిమితమై ఉన్నావు. నీకు ఏవో అలవాట్లు ఉన్నాయి, ఆ అలవాట్లకు పరిమితమై ఉన్నావు. ప్రపంచం అంతా చైతన్యం వ్యాపించి ఉంది, అది అందరిలోను ఉంది, బయట ఉంది. నువ్వు చైతన్యంలో ఐక్యమవ్వాలి, అందులో ఐక్యమైతే ఈ సృష్టిని ప్రేమించకుండా ఉండలేవు. ఏ జ్ఞానికూడా ప్రపంచాన్ని ప్రేమించాలని ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు. తెల్లబట్టలు వేసుకొందామా, ఎర్రబట్టలు వేసుకొందామా ఇటువంటి విషయాలలో నిర్ణయాలు ఏమీ అక్కరలేదు. ఏ కారణాల వలన నువ్వుకాని శరీరానికి, ప్రపంచానికి బంధింపబడి ఉంటున్నావో, నూటికి నూరుపాళ్ళు అసత్యమైన ఈ ప్రపంచాన్ని సత్యంలాగ ఏ వాసనలు అయితే మీకు అనిపింపచేస్తున్నాయో వాటిని తెలుసుకొని, వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని బట్టలు మార్చుకోవటంకాదు. ఏ కారణం వలన అనిత్యాన్ని నిత్యం అనుకొంటున్నావో ఆ కారణాలను తెంచుకోవటమే సన్యాసం అంతేగాని బట్టలు మార్చుకోవటం సన్యాసంకాదు.

ఆకాశంలో సూర్యుడు ఉన్నాడు. మీ మొఖం అటు తిప్పకపోతే ఆయన మీకు కనబడడు. అలాగే మీ హృదయంలో జ్ఞానసూర్యుడు ఉన్నాడు. నీకు లోచూపు లేకపోతే ఆయన మీకు కనబడడు. నువ్వు విభూతి రేకలు పెట్టుకొని తిరిగితే సరిపోతుందా, మరి నామాట ఏమిటి. లోచూపు రాదు రాదు అని చెప్పకు, లోచూపు అలవాటు చెయ్యవయ్యా శివయ్యా అంటున్నాడు. మనకు ప్రేమ ఉంది అనుకోండి, అది ఇంట్లోవారికి పంచిపెడుతూ ఉంటాము, జ్ఞాని ప్రేమకు హద్దులు లేవు, వాడు ప్రేమను లోకానికి అంతా పంచిపెడతాడు. ఎందుచేతనంటే వాడికి నీవు, నేను అనే బేధబుద్ధి లేదు, అన్నీ ఉపాధులు వాడివే. ఫలానా పేరునాది, ఫలానా శరీరం నాది అని మనం ఒక నిర్ధారణకు వచ్చేసాము ఇంక మన ప్రేమను అందరికీ ఎలా పంచిపెడతాము. ఆత్మజ్ఞానం కలిగాక ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అని వాడు అనుకోడు. ఎప్పుడైతే రూపబుద్ధి, నామబుద్ధి పోయిందో వాడి ప్రేమ సృష్టి అంతా ప్రవహిస్తుంది. మనం ఎక్కడ అవుటయిపోతున్నాము అంటే ఫలానా రూపం నాది, ఫలానా పేరు నాది అని అక్కడతోటి ఆగిపోతున్నాము. ఈ రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి బయటకు రాలేకపోతున్నాము. అందుచేత మనం ప్రేమను లోకానికి పంచిపెట్టాలన్నా అది సాధ్యంకాదు.

ప్రతీ దేహానికి ఒక ప్రారబ్దం ఉంటుంది. ఆ ప్రారబ్దం ఖర్చు అయ్యేవరకు ఆ దేహం జీవించి ఉంటుంది. ఆ దేహం ఏ ప్రాంతంలో ఉండాలో, ఎక్కడ చనిపోవాలో ఇది అంతా

ఈశ్వర నిర్ణయం ప్రకారం జరిగిపోతూ ఉంటుంది. ఈలోపుగా నువ్వు గుంజుకున్నా ప్రయోజనం లేదు. ఓ అర్జునా! నీ జ్ఞాపకాన్ని నేను, నీ మరుపు నేను అంటాడు పరమాత్మ. ఒకోసారి చూడండి మనం జ్ఞాపకం పెట్టుకోవాలి అనుకొన్నా మరిచిపోతాము. ఒకోసారి ఈ గొడవ మరిచిపోవాలి అనుకొన్నా అదే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. నీ జ్ఞాపకాన్ని నేను, నీ మరుపును నేను అంటే ఉన్నదంతా నేను నువ్వు లేవురా అని చెప్పకుండా చెప్పటం. నీ చేతిలో ఉన్న పనిని నిర్మలంగా, నిశ్చలంగా వికారాలు లేకుండా చేసి ఈ శరీరాన్ని విడిచిపెట్టి బయటకు వెళ్ళిపో. అన్నింటికి నేను కర్తను అని ఏడుస్తావు ఎందుకు? ఈశ్వరుడే కర్త అని తెలియకపోవటం వలన నీకు దుఃఖం వస్తోంది. ఈశ్వర సంకల్పం ప్రకారమే అంతా జరుగుతోంది అని మీకు అర్థమైతే ఇంక నీకు దుఃఖం దేనికి వస్తోంది, అశాంతి ఎందుకు వస్తోంది. ఏ తలంపులు అయితే నిన్ను బాధ పెడుతున్నాయో వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రాక్టీసు చెయ్యి. నువ్వు చేసే ప్రాక్టీసు వెనకాల నా దయ ఎలాగు ఉంటుంది, ఎప్పుడో ఒక కెరటం వస్తుంది, దానిలో నీ అలవాట్లు అన్నీ కొట్టుకొనిపోతాయి. అలవాట్లు పోయినాయి అనుకో, అలవాట్ల తాలుక బీజాలు కొన్ని ఇంకా లోపల ఉన్నాయి అనుకో. అవి పునర్జన్మకు కారణం అవుతాయి. అటువంటప్పుడు నేను ఏమి చేస్తాను అంటే జీవుడు శరీరం నుండి విడిపోయే టైములో ఆ బీజాలను కాల్చేస్తాను అన్నాడు, వాడు ఈశ్వరుడు. ఇది అందరికీ చెయ్యడు. ఎవరికైనా ఏవైనా చిన్న చిన్న గొడవలు ఉంటే మరల అవి పునర్జన్మకు కారణం కాకుండా వాటిని కాల్చి బూడిద చేస్తాడు. అవి తిరిగి ఇంకో శరీరంలోనికి వెళ్ళి మొలకెత్తటానికి అవకాశం లేదు అంటే ఇంక మీకు పునర్జన్మ రాదు.

వాసనలు కనిపించని సంకెళ్ళ వంటివి. సంకెళ్ళు ఏవిధంగా అయితే మనిషిని ఒక స్థంబానికి బిగించి ఉంచుతాయో అలాగే ఈ వాసనలు దేహభావనను పెంచేసి ఈ జీవుడిని దేహానికి కట్టేసి ఉంచుతున్నాయి. సంకెళ్ళను మనం గొడ్డలిపెట్టి నరుక్కోవచ్చుకాని ఈ వాసనలు అనే సంకెళ్ళను నరకటానికి అవి మనకు కనబడవు. ఈ వాసనలు అన్నీ వేరుతోసహా పోవాలంటే నీ అనుగ్రహం కావాలి అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగారు. నా అనుగ్రహం లేకుండా ఇక్కడకు ఎవరు నిన్ను రప్పించారు. నీ తెలివితేటలను బట్టి నువ్వు ఇక్కడకు రాలేదు, నా అనుగ్రహమే ఇక్కడకు తీసుకొని వచ్చింది. ఈ అనుగ్రహం ఎందుకు నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చిందో ఆ పని పూర్తి అయ్యేవరకు అది నిన్ను విడిచిపెట్టదు. అందుచేత ఏదీ నీవు ప్రత్యేకంగా నోరు తెరిచి అడుగనక్కరలేదు. మీరు ఏదైనా మంచి చేస్తే మీకు

గౌరవం కావాలంటే వస్తుంది కాని ఈశ్వరుని దయ రాదు. చేసిన మంచి పనిని మరిచిపోయి, గుర్తింపులు అక్కరలేకుండా, క్వయిట్‌గా కూల్‌గా ఉండగలిగితే లోపల ఉన్న కామం నశించిపోతుంది. గుర్తింపులు కోరుకోవటం వలన కామం పెరుగుతుంది.

మనం ఏదైనా మంచిమాట విని ఉంటే, మంచి మాటలు చదివితే, మంచిమాటను మననంచేస్తే అది జీవితంలో ఎప్పుడోకప్పుడు మనకు ఉపయోగపడుతుంది. మీరు భగవద్గీతలో కొన్ని శ్లోకాలు నేర్చుకొని ఉంటే మీకు ఎప్పుడైనా ఇబ్బంది వచ్చినప్పుడు ఆ శ్లోకం మిమ్మల్ని కాపాడుతుంది, ఆ శ్లోకం మీ శోకాన్ని తీసేస్తుంది. అందుచేత ఒకవేళ మననం చేసినా చెయ్యకపోయినా ఒకసారి విని ఉంటే ఎప్పుడైనా సడన్‌గా విన్నది గుర్తుకువస్తుంది, అది కవచంలాగ మనలను కాపాడుతుంది. మంచి చేసినవాడికి, మంచి విన్నవాడికి, మంచి ఆలోచించినవాడికి దుర్గతి లేదు అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడిని తెలుసుకొనే బుద్ధి మాకు లేదు అని కంగారు పడవద్దు. నా మీద ఇష్టం పెంచుకొంటే, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం కలిగి ఉంటే, మీ ఇంట్లో వారిని ఎలా ప్రేమిస్తున్నారో అలాగ మీ ప్రేమ నా పాదాలవైపు ప్రవహిస్తూ ఉంటే మీకు ఎటువంటి బుద్ధిని ప్రసాదిస్తే ఈశ్వరుడు మీకు అనుభవంలోనికి వస్తాడో అటువంటి బుద్ధిని నా చేతులతో మీకు ఇస్తాను అని పరమాత్మ చెప్పాడు.

ఈ దేహానికి భోగాలు అనుభవించటం తప్పించి ఏమీ అక్కరలేదు, ఈ దేహం ఇంక ఎందుకు పనికిరాదా? ఇది భోగాలు అనుభవించటానికే పుట్టిందా? మీకు దేహము, మనస్సు తెలుస్తున్నాయి కదా. రోజూ నిద్రపోయేముందు ఇవాళ ఈ దేహం ఎలా ఉపయోగపడింది, మనస్సు ఎలా ఉపయోగపడింది. వీటిని భోగాలు అనుభవించటానికి ఉపయోగించుకొన్నామా, బ్రహ్మానుభవం పొందటానికిఏమైనా వీటిని ఉపయోగించుకొన్నామా అని ఏ రోజుకారోజు ప్రశ్నించుకొని అప్పుడు నిద్రపోండి. శివుడు మారువేషంలో వచ్చి తిరువాచకంలో నువ్వు ఇంత గొడవ వ్రాసావు, మొత్తం తిరువాచకం అర్థం అంతా చెప్పేయవయ్యా అని మాణిక్యవాచకర్‌ను అడిగాడు. ఆయన ఏమన్నాడు అంటే ఇన్ని అర్థాలు లేవు, దీని అర్థం అల్లా శివుడే, ఇంకో అర్థం లేదు అని చెప్పాడు, వాడు మాణిక్యవాచకర్. శివుడు గురించి మాణిక్యవాచకర్ అంత గొప్పగా చెప్పాడు. శివుడు ఉన్నాడా అని భగవాన్‌ను అడిగితే నువ్వు ఉంటే వాడు ఉన్నాడు, నువ్వు లేకపోతే వాడూ లేడు. నువ్వెంత నిజమో వాడూ అంతే నిజం అని చెప్పాడు. అంటే మిమ్మల్ని లోపలకు తోలుకొని వెళ్ళటమే ఆయన

పని. నిన్ను ఎంతదూరం తోలుకొనివెళ్ళాలో అంతదూరం తోలుకొనిపోతాడు. ఈలోపుగా వీడిని వదిలేద్దాము అని మీరు అనుకొన్నా ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు, అదో ప్రమాదం. శివుడు లేడు, రాముడు లేడు, దేవతలు లేరు, యజ్ఞాలు లేవు ఏమీ లేవు, లోపలకు మిమ్మల్ని తీసుకొని పోవటమే ఆయన పని. సద్వస్తువు ఎంత లోతులలో ఉందో అంత లోయలలోనికి మిమ్మల్ని తోలుకొని పోవటం తప్ప ఇంకోపని ఆయనకు లేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-06-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదములసారం భగవద్గీత. ఇది భగవంతుడిచేత స్వయంగా చెప్పబడినది. వేదములు అనే చెట్టుకు కాసినపళ్ళు ఉపనిషత్‌లు. ఆ ఉపనిషత్‌లలో ఉన్న రసం భగవద్గీత. భగవద్గీత మన ఇంట్లో ఉంటే నాలుగు వేదములు ఉన్నట్లే. మనలో అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడు. ఆయనే కృష్ణుడిగా అవతరించి భగవద్గీతను మనకు ఉపదేశించాడు. భగవద్గీతలో నాలుగు యోగాలు వస్తాయి. యోగము అంటే ఉపాయము. భగవంతుడిలో ఐక్యమవ్వటానికి భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం, ధ్యానయోగం ఇవి అన్నీ ఉపాయాలు. వీటిలో ఏదో మార్గంలో ప్రయాణం చేసి మనం భగవంతుడిలో ఐక్యమవ్వాలి. కామం యొక్క వేగం, క్రోధం యొక్క వేగం, మనోవేగం ఈ వేగాలు నెమ్మదిగా తగ్గించుకొంటూ రండి. ఈ వేగాలు తగ్గించుకోవటానికే మంత్రం, యంత్రం, తంత్రం చెప్పారు. ఏదో భగవంతుడి నామాన్ని తీసుకొని మీరు జపిస్తూ ఉంటే మనోవేగం తగ్గుతుంది. మంత్రాన్ని జపించటం వలన మనం పవిత్రులమవుతాము. యంత్రం అంటే శ్రీచక్రపూజలు అవి చేస్తారు, మనోనిగ్రహానికి అవి సహకరిస్తాయి. సర్వసాధారణంగా మన మనస్సు, ఇంద్రియాలు లోకంవైపుకు వేగంగా పోతూ ఉంటాయి. మనకు లోకవాసన, దేహవాసన ఎక్కువగా ఉంటుంది. ఈ దేహవాసనలోనుండి, లోకవాసనలోనుండి మనస్సును తప్పించి భగవంతుడి వైపుకు మళ్ళించటానికి తంత్రం పెట్టారు. మంత్రం, యంత్రం ఇవి అన్నీ తంత్రంలో భాగాలు.

మీకు ఏకాంతవాసము ఇష్టం ఉండటంలేదు. మీరు రోజూ ఇంట్లో ఒక గంటసేపు ఏకాంతంగా కూర్చోవాలి. ఏకాంతవాసం, సహవాసం, ఉపవాసం. ఏకాంతవాసంలో రోజూ గంటసేపు ఉంటే మన మనస్సులో ఏమి జరుగుతుందో మనకి తెలుస్తూ ఉంటుంది. ఏకాంతంగా ఉండటం వలన మనకు ఇంకో లాభం ఏమిటి అంటే మౌనం అలవాటు

అవుతుంది. మౌనం వలన మనకు శారీరకశక్తి వస్తుంది, మానసికశక్తి వస్తుంది, ఆరోగ్యం బాగుపడుతుంది. ఏకాంతవాసం అలవాటు అయినవారు జీవితంలో ఎక్కువ మౌనంగా ఉంటారు. వారు అవసరమైతే మాట్లాడతారు, అవసరంలేకపోతే మాట్లాడరు. అవసరమైతే మాట్లాడేవారిమాట కఠినంగా ఉండదు, మృదువుగా ఉంటుంది, నిర్మలంగా ఉంటుంది, ఆమాట మీకు శాంతిని చేకూరుస్తుంది. కొంతమంది ఎప్పుడూ ఇతరులను నిందిస్తూ ఉంటారు. వారిని వారు పొగుడుకొంటూ ఉంటారు. ఇటువంటివారు ఒకవేళ పొరపాటున ఎప్పుడైనా మంచిమాట చెప్పినా ఆ మాట యొక్క ప్రభావం ఎవరిమీద ఉండదు, ఎవరూ దానిని పట్టించుకోరు.

మీ దేహప్రారబ్ధాన్నిబట్టి సంపదలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి, గౌరవాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి, బంధువులు వస్తూ ఉంటారు పోతూ ఉంటారు. దేహం ఎంత నిజమో ఇవన్నీ అంతే నిజం. దేహప్రారబ్ధాన్ని బట్టి ఏది రావాలో అది భగవంతుడి సంకల్పాన్ని బట్టి వస్తుంది. మీకు ఇంటి దగ్గర సమస్యలు వస్తున్నాయి అనుకోండి, భగవంతుడికి తెలియకుండా అవి రావటం లేదు. మీకు సంతోషం వచ్చినప్పుడు, దుఃఖం వచ్చినప్పుడు ఒకే రకంగా ఉండటం నేర్చుకోగలిగితే తొందరగా మీకు మనోనిగ్రహం వచ్చేస్తుంది. ఆచార్యులవారి గురించి కొంతమంది ఏమంటారు అంటే కైలాస శంకరుడే కాలడి శంకరుడు అంటారు. ఆయన గ్రంధాలు వ్రాసాడు, కాలినడకన తిరిగి బోధించాడు. ఆయన వ్రాసిన భాష్య గ్రంధాలను అవి భాష్యగ్రంధాలు కాదు భాష్యదీపాలు అంటారు. అజ్ఞానం అనే చీకటిలో ఉన్న మనలను వెలుతురులోనికి తీసుకొనిరావటానికి వ్రాసాడు కాబట్టి అవి గ్రంధాలు కాదు దీపాలు అని కొంతమంది అంటారు.

ఆచార్యులవారు ఒకచోట ఏమనిచెప్పారు అంటే మీరు దేనికి తొందరపడకండి. మీకు పుణ్యాలు చేసినట్లు లేక పాపాలు చేసినట్లు స్వప్నం వచ్చింది అనుకోండి. మెలకువ వచ్చాక, అది స్వప్నం అని నీకు అర్థమయ్యాక పాపం చేసినవాడు నేను పాపం చేసాను అని అనుకోడు, పుణ్యం చేసినవాడు నేను పుణ్యం చేసాను అని అనుకోడు. ఈ పాపము, పుణ్యము కూడా అసత్యమే అని తెలిసిన తరువాత ఆ పుణ్యానికి గర్వపడడు, పాపానికి దుఃఖపడడు. అలాగే అజ్ఞానం ఉన్నంతసేపు ఈ ప్రపంచం అంతా నిజంకింద అనిపిస్తుంది. అజ్ఞానంలో ఉన్నప్పుడు నీకు ఈ ప్రపంచం ఎంత సత్యంగా కనిపిస్తోందో జ్ఞానం రాగానే అది అంత అసత్యం అని నీకు తెలుస్తుంది. అప్పుడు ఈ పుణ్యపాపాలకు విలువ ఏముంది? వీటిని అసలు నీవు

పట్టించుకోవు. ఆ ఎత్తుకు ఎదిగిరా. ఎప్పుడోకాదు, ఇప్పుడే ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పుడే ఆ స్థితిని పొందు అంటున్నారు ఆచార్యులవారు. నీకు భిన్నంగా ఎవరు ఉన్నారు. అన్నీ స్వప్న శరీరాలే. ఎవరి గురించి సంతోషపడతావు, ఎవరి గురించి దుఃఖపడతావు. బ్యాటరీ లైటులో బ్యాటరీలు ఉన్నంతసేపు అది వెలుగుతూ ఉంటుంది. బ్యాటరీలు అయిపోయిన తరువాత లైటు అక్కడే ఉంటుంది, స్విచ్ అక్కడే ఉంటుంది, వెలగదు ఇంక ఆగిపోతుంది. అలాగే నీ మనస్సు వాసనలు అనే మూటను నెత్తిమీద వేసుకొని వస్తోంది. నువ్వు సాధన చేసి గురువు అనుగ్రహం వలన ఆ వాసనలు అనే మూటను దింపి అవతల పడేసావు అనుకో ఇంక నీ మనస్సును కదలమన్నా అది కదలదు. ఈ కదలని మనస్సుకొ పునర్జన్మ అంటున్నారు ఆచార్యులవారు. కదిలే మనస్సుకు పునర్జన్మ కాని కదలని మనస్సుకు పునర్జన్మ లేదు. ఏ వాసనల వలన మనస్సు పనిచేస్తోందో ఆ వాసనలు అన్నీ పోతే మనస్సు ఇంక కదలదు. కట్టెలు అయిపోయిన తరువాత మంట ఎలా ఆరిపోతుందో అలాగ మనస్సును నడిపే వాసనలు ఖర్చు అయిపోయిన తరువాత మనస్సు ఆరిపోతుంది. అప్పుడు నీకు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఆ ఎత్తుకు మిమ్మల్ని తీసుకొనిపోవాలి అని ఆచార్యులవారి ప్రయత్నం. అందుకే వ్రాసాడు, అందుకే మాట్లాడాడు, అందుకే దేశం అంతా తిరిగాడు ఆయన.

ప్రతీ మనిషికి ఇష్టాలు, అయిష్టాలు ఉంటాయి. ఈ ఇష్టాలు, అయిష్టాలు ఉన్నంతకాలం ఎవడు ఎంత ప్రయత్నం చేసినా వాడికి మనోనాశనం సాధ్యంకాదు. చేతులు లేనివాడు చెట్టు ఎక్కటం ఎటువంటిదో, ఇష్టాలుఅయిష్టాలు పెట్టుకొని మనస్సును నశింపచేసు కోవటానికి చేసే ప్రయత్నం కూడా అటువంటిదే. ఎందుచేతనంటే ఇష్టాలు, అయిష్టాలు మనస్సును పెంచేస్తాయి ఇంక అది ఎలా నశిస్తుంది. భగవంతుడి మీద మనకు నమ్మకంలేదు, మనందరము విశ్వాసహీనులం. వాదనలు చేయమంటే వాదనలు చేస్తాము కాని మనకు విశ్వాసము లేదు. భగవంతుడి మీద విశ్వాసం ఉంటే ఆయన చెప్పిన మాట మీద శ్రద్ధ కలుగుతుంది. విశ్వాసం లేనప్పుడు శ్రద్ధ ఎక్కడ నుండి వస్తుంది, ప్రేమ ఎక్కడ నుండి వస్తుంది, తపన ఎక్కడ నుండి వస్తుంది. హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అది ఇచ్చే వెలుగు సహాయంతో మనస్సు లోకాన్ని చూస్తోంది. ఎవరిచ్చిన వెలుగు సహాయంతో మనస్సు లోకాన్ని చూస్తోందో ఆ వస్తువును మనస్సు చూడలేదు, ఎక్కడైతే మనస్సు పూర్తిగా అణిగిపోయిందో అక్కడ ఆ వస్తువు తెలియబడుతుంది కాని మనస్సు వెళ్ళి దానిని పట్టుకోలేదు.

ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే పంది మలం తింటోంది, మనం అన్నం తింటున్నాము. ఇంద్రియ భోగాలు పందీ అనుభవిస్తోంది, మనమూ అనుభవిస్తున్నాము. ఇంద్రియభోగాలతో సరిపెట్టుకొని, సత్యాన్వేషణ చేయకుండా చనిపోతే మనకీ పందికీ తేడా ఏమిటి అంటున్నారు ఆచార్యులవారు. పందిలా తినటమే పనా మనకి, సత్యాన్వేషణ చేయకపోతే ఇంక ఈ మానవ శరీరం దేనికి వచ్చినట్లు అంటున్నారు.

యోగంలో స్థిరపడు. భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు. నటరాజు డాన్స్ చేసేటప్పుడు ఒకపాదం మీకు చూపిస్తూ ఉంటాడు. అంటే లోకంలో ఉన్న భోగాలను చూసి నా పాదాలను విడిచిపెట్టకండి అని చెప్పటం. మనం శరీరాన్ని శుద్ధిగా ఉంచుకోవటానికి చూస్తాముకాని మనస్సును శుద్ధిచేసుకోవటంలేదు. మనస్సును శుద్ధిగా ఉంచుకోవాలి అంటే మీ మాట, చేత, ఆలోచన నిదానంగా ఉండాలి, నిర్మలంగా ఉండాలి. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన సర్వసాక్షి. ఆయన మనం చేసే పనులను, మనకు వచ్చే తలంపులను చూస్తున్నాడు. అందుచేత నువ్వు ఒకమాట మాట్లాడితే, ఒక పనిచేస్తే, మనస్సులోనికి ఒక ఆలోచన వస్తే వాటికి భగవంతుడు సంతోషించాలి. మీ చుట్టాలు కాదు సంతోషించవలసింది. వారు మీకు మోక్షాన్ని ఇవ్వలేరు సరికదా వాసనలు పెంచమంటే పెంచుతారు. ఆధ్యాత్మికం మాట వదిలివేయండి, భౌతికంగా కూడా వారు చేసేది ఏమీ ఉండదు. అందుచేత వారి గురించి ఆలోచించి మీ టైమును పాడుచేసుకోవద్దు. ఎవరితో అయినా తగుమాత్రంగా ఉండాలి కాని అతిగా ఉండకకండి. మిగతా కాలాన్ని అంతా నీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి ఉపయోగించుకో. నీ మనస్సును పవిత్రం చేసుకోవటం కంటే మించిన పని ఈ లోకంలో ఏమీ లేదు.

ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే ఈ ఇంద్రియాల గొడవ, మనస్సు గొడవ, బుద్ధి గొడవ, లోకం గొడవ ఏమిటి? ఇవి అన్నీ నిజంకాదు. ఇవి ఏమీ ఆత్మకాదు. నిజంకాని దాని వెంట ఎన్నాళ్ళు ఇలా పరిగెడతావు. అది అంతా అనాత్మ. అనాత్మ గొడవలన్నీ తీసెయ్యి. ఇంద్రియాలు ఆత్మకాదు, నీ మనస్సు ఆత్మకాదు, పుణ్యపాపాలు ఆత్మకాదు, ఆత్మ నీ హృదయంలో ఉంది. నువ్వు వివేకాన్ని పెంచుకొని అనాత్మ గొడవలు అన్నీ బయటకు గెంటెయ్యి. పెంట అంతా తీసి అవతల పారెయ్యి. ఈ శరీరము, మనస్సు, ఇంద్రియాలు, లోకం, నీ దుఃఖం, సంతోషం ఇవి ఏమీ సత్యం కాదు. నువ్వు వివేకాన్ని పెంచుకొని, వైరాగ్యాన్ని పెంచుకొని ఏది

సత్యం, ఏది అసత్యం అని విడదీసుకొని సత్యంకాని విషయాలను బయటకు గెంటెయ్యి. దీనికి బుద్ధిసూక్ష్మత ఉండాలి. బుద్ధిసూక్ష్మత ఒక్కటే సరిపోదు ఈశ్వరుని దయకూడా ఉంటేనే కాని నువ్వు ఏది ఆత్మ, ఏది అనాత్మ అనే విభజన చేయలేవు. ప్రాపంచిక విద్యల వలన నీ పొట్ట వెళ్ళిపోతుంది, నాలుగు రూపాయలు సంపాదించుకోవచ్చు అంతేగాని వాటివలన నీకు మోక్షం రాదు. ఒక్క ఆత్మవిద్య మాత్రమే నీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అందుచేత నీ శరీరయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ మిగతాటైమునంతా ఆత్మజ్ఞాన సముపార్జనకు ఉపయోగించుకో.

ఎదుటివారికి నువ్వు ఏది చేస్తే అదే నీకు ఎదురు వస్తుంది. నువ్వు ఎదుటివారి గురించి చెడ్డగా ఆలోచిస్తే నీకు చెడ్డ ఎదురవుతుంది. ఆత్మ అందరి హృదయాలలో ఉంది, అదే నీ హృదయంలో కూడా ఉంది, అదే నువ్వు, అంటే నువ్వు అందరి హృదయాలలో ఉన్నావు కదా. నువ్వు మనోనిగ్రహం కలిగి ఉండి, అందరి హృదయాలలో ఉన్న నిన్ను చూసుకొంటూ, ఇతరులను ప్రేమిస్తూ, వారికి చేయగలిగిన సహాయం చేస్తూ అలా పని చేస్తూ ఉంటే నువ్వు పని చేసినా చేయనివాడితో సమానము, వాడు చేసిన కర్మ పునర్జన్మకి కారణం అవ్వదు. ఒకవేళ అప్పడు వాడి మనస్సులో విత్తనాలు పడినా ఈశ్వరానుగ్రహం వలన కాలిపోతాయి. కాలిపోయిన విత్తనం మరల మొలవదు, అది పునర్జన్మకుకారణం అవ్వదు. మనం చిన్నవిత్తనం నాటితే పెద్దవృక్షం అవుతుంది. అంత చిన్నవిత్తనంలోనుండి ఇంత పెద్ద చెట్టు వచ్చిందా అని మనకు ఆశ్చర్యం కలుగుతుంది. అలాగే ఈ దేహం చనిపోయేటప్పడు మనలో చిన్నవాసన మిగిలిఉన్నా అది పెద్ద సంసారానికి కారణం అయిపోతుంది. చిన్నవాసనే కదా అని నువ్వు అశ్రద్ధ చేస్తే సంసారం రావటానికి, నీకు పునర్జన్మ రావటానికి ఆ చిన్నవాసన చాలు. అందుచేత వాసనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, పూర్తిగా వాసనాక్షయం అయితేగాని నీకు ఆత్మజ్ఞానంరాదు.

పూర్వమీమాంసలో అపూర్వవిధి, నియమవిధి, పరిసంచాకవిధి అని మూడు రకాలుగా చెప్పారు. అపూర్వవిధి అంటే చెప్పటానికి చాలా కష్టమైన విషయం చెప్పగలగటం. అది చెప్పటం సాధ్యంకాదు అటువంటి విషయం ఎవడైనా చెప్పగలిగితే అది అపూర్వం. మనోనాశనం అయ్యాక ఒకవేళ శరీరంతో ఉన్నా వాడు పొందిన అనుభవం వాడే చెప్పలేడు. ఎందుచేతనంటే అది మాటలకు అందదు, మనస్సుకు అందదు, బుద్ధికి అందదు ఇంక ఎలా చెపుతాడు. నియామక విధి అంటే కొంతమంది పేకాటలో, గుర్రపు పందాలలో డబ్బు

సంపాదిస్తారు. అలా డబ్బు వచ్చిపడింది అనుకో దానిని వదిలెయ్యి. మామూలుగా నువ్వు ఏదో పని చేసుకొని డబ్బును సంపాదించవచ్చు అంటే డబ్బు సంపాదనలో కూడా నియమం విడిచిపెట్టకు. ఒక నియమం లేకుండా, ఒక పద్ధతి లేకుండా నీకు డబ్బు వచ్చేస్తూ ఉంటే బాగావస్తోంది అనుకోకు, అక్కడతోటి ఆపేసి నీ సంపాదనను ఒక క్రమపద్ధతిలో పెట్టుకో. క్రమం తప్పిపోయింది అనుకో దానివలన వచ్చేబాధ ఇప్పుడు నీకు తెలియకపోయినా రాబోయేజన్మలో దాని వలన నువ్వు సఫర్ అవ్వవలసి ఉంటుంది. అంటే నువ్వు అక్రమ మార్గాలకు వెళ్ళకు, క్రమమార్గంలో ఉండు అంటే నియామకవిధి విడిచిపెట్టవద్దు. రమణమహర్షిగారు మనకు పనికిరాని విషయాలను అసలు చెప్పరు. ఒక్క ఆత్మగురించి తప్ప మిగతా విషయాలు చెప్పరు. ఆచార్యులు మనకు పనికివచ్చే విషయాలు చెపుతారు. పనికిరాని విషయాలు కూడా చెపుతారు. పనికిరాని విషయాలు ఎందుకు చెపుతారు అంటే ఆ విషయాలలోనికి వెళితే ఈ ప్రమాదం ఉంది, వాటి వలన తాత్కాలికంగా మీకు లాభాలు వచ్చినా పరిణామంలో దుఃఖం వచ్చేస్తుంది అని తెలియజేసి వాటిలోనికి మీరు వెళ్ళకుండా చూడటంకోసం పనికిరాని విషయాలు కూడా మనకు ఆచార్యులు చెపుతూ ఉంటారు, దీనినే పరిసంచాకవిధి అంటారు. ఎందుకు ఇటువంటి గొడవలు అన్నీ మనకు చెపుతున్నారు అని మనకు అనిపిస్తుంది కాని అందులో ఉన్న ప్రమాదం మనకు తెలియజేసి భవిష్యత్‌లో మనం వాటిలో పడకుండా చూస్తారు. వాడు ఆచార్యుడు.

వాలి రాముడితో అంటాడు నువ్వు సత్పురుషుడిలాగ కనిపిస్తున్నావు కాని నీ లక్షణాలన్నీ దుష్టుడి లక్షణాలు. నా ఎదురుగావచ్చి నన్ను ఎందుకు చంపలేదు. నేను సుగ్రీవుడితో యుద్ధం చేస్తూ ఆ మైకంలో ఉండగా ఎక్కడో చెట్టుచాటునుండి బాణంవేసి చంపుతావా? నువ్వు సత్పురుషుడివేషంలో ఉన్న దుష్టుడవు అని వాలి అంటాడు. అప్పుడు కూడా రాముడు ప్రశాంతంగా ఉన్నాడు, ఆయన మనోనిగ్రహం చూడండి. విద్య గలవాడికి వినయం రావాలి. మీకు విద్య ఉండి వినయం రాకపోతే అది ఒక విద్యా అంటాడు ఆచార్యులవారు. నిప్ప కాలుస్తుంది అది దాని ధర్మం. మేము నిప్పను ముట్టుకొన్నాము కాలలేదు అని అంటే అది నిప్ప కాదని అర్థం. మేము బాగా విద్యావంతులము మాకు వినయంలేదు అంటే మీరు నేర్చుకొన్నది విద్యకాదు, అది అవిద్య. బాగా చదువుకొని వినయం సంపాదించుకొన్న బ్రాహ్మణుడిలో, కుక్కలో, కుక్కమాంసం తినేవాడిలో, ఏనుగులో అందరిలో ఉన్న పరమాత్మ ఒక్కడే. వారి శరీరాలు తేడాగా ఉండవచ్చు, వారి గుణాలు తేడాగా ఉండవచ్చు. వారి వారి

కర్మలను బట్టి వారు అలా ఉన్నారు. అంతా జీవకోటే. నీకు ఎందుకు వారి గొడవ. అందరిలోను పరమాత్మ ఉన్నాడు, ఆయనను చూడటం నేర్చుకో. అప్పుడు ఇంక నీకు వికారాలు రావు. మనస్సు కూడా అనాత్మ. నువ్వు అనాత్మతో తాదాత్మ్యం పొందుతున్నావు. ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి మీద పడుతుందో చెప్పలేము. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం చేసేవాడు అంత జాగ్రత్తగా ఉండాలి.

వాడు అటువంటివాడు, వీడు ఇటువంటివాడు అని విమర్శలజోలికి వెళ్ళవద్దు. మిగతా వారి గొడవ నీకు ఎందుకు. వారి రూపాలు ఎలా ఉన్నా, వారి గుణాలు ఎలా ఉన్నా నువ్వు మటుకు వారిలో అంతర్యామిగా ఉన్న నారాయణుడిని దర్శించు, అప్పుడు నువ్వు నిజమైన పండితుడివి అవుతావు. మీరు వైకుంఠాలగొడవ, కైలాసాలగొడవ వదిలేయండి. బోత్‌సైడ్స్ హేపీనెస్ చూసుకోమని చెపుతున్నారు. అంటే శరీరం ఉంటే సుఖం, శరీరం లేకపోతే సుఃఖం, ప్రపంచం కనిపిస్తే సుఖం, ప్రపంచం కనిపించకపోతే సుఖం ఇలా బోత్‌సైడ్స్ సుఖం రావాలి, అదీ అద్వైత బోధ. పాపాలు పుణ్యాలు గొడవ వదిలేయండి. సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి. బ్రహ్మానుభవం కలిగాక ఈ పుణ్యపాపాలు అన్నీ స్వప్న సమానము. పుణ్యం స్వర్గంలోకికాని, పాపం నరకంలోకికాని పంపలేవు. అవి శక్తిహీనం అయిపోతాయి, బ్రహ్మజ్ఞానం అనే అగ్నిలో అవి కాలిపోతాయి. ముందు నీ మనస్సులో ఉన్న కల్మషం ఏమిటో చూసుకొని అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చెయ్యి. అస్తమాను బజారులో పడిపోకండి. రోజూ ఒక గంట ఏకాంతంగా ఉంటే మీ మనస్సులో ఉన్న కల్మషం మీకు తెలుస్తుంది. ఒకవేళ మీరు దానిని గ్రహించలేకపోయినా, ఆ కల్మషాన్ని మీకు తెలియజేసి, దానిలోనుండి బయటకు వచ్చే శక్తిని కూడా ఆయనే మీకు ప్రసాదిస్తాడు. వాడే ఆచార్యుడు. అయితే మనకు విశ్వాసం ఉండాలి. నీ ఎదురుగా కొండ ఉంది అనుకో. నువ్వు నిజంగా విశ్వాసపాత్రుడివి అనుకో, ఆ రోడ్డు దాటి వెళ్ళి అక్కడ కూర్చో అని కొండను ఆదేశిస్తే కొండవెళ్ళి అక్కడ కూర్చొంటుంది అంటాడు ఆచార్యుడు. ఆచార్యులవారి ఇంటికి మూడు ఫర్లాంగుల దూరంలో పూర్ణానది ఉండేది. ఆచార్యులవారి తల్లి పెద్ద వయస్సులో స్నానం చేయటానికి అంత దూరం నడవలేక వచ్చేటప్పుడు పడిపోయింది. అంతదూరం ఎందకు నదీస్నానం మానేయమని ఈయన చెప్పినా ఆవిడ మానేది కాదు, దానికి అలవాటుపడిపోయింది. ఆచార్యులవారు ఏమి చేసారు అంటే నువ్వు దూరంగా ఉన్నావు, కొంచెం మా ఇంటి ప్రక్కనుండి ప్రవహించు అని ఆ నదిని ప్రార్థిస్తాడు. అప్పుడు ఆ నది ఆయన ఇంటి ప్రక్కనుండి ప్రవహిస్తుంది. మీరు కాలిడి వెళ్ళి

చూస్తే నది ఎలా మలుపు తిరిగిందో మీకు తెలుస్తుంది.

పెట్రోలు వలన కారు ఎలా నడుస్తూ ఉంటుందో అలాగ ఈ వాసనల వలన మనస్సు నడుస్తూ ఉంటుంది. పెట్రోలు అయిపోతే కారు ఆగిపోతుంది అలాగే నీలో ఉన్న వాసనలు అన్నీపోతే మనస్సు పనిచేయటం ఆగిపోతుంది అంటే జన్మలు ఆగిపోతాయి. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నిన్ను ఎవడైనా చూసి అసూయపడుతున్నాడు అనుకో, నిన్ను ఎవడైనా ప్రేమిస్తున్నాడు అనుకో అందులో ఏముంది. వాడూ నువ్వే కదా. కాని విమర్శించేవాడు ఏమనుకొంటాడు అంటే వాడూ నువ్వూ వేరు అనుకొంటాడు. వాడూ నువ్వూ ఒక్కటే అనుకొన్నప్పుడు ఎవడో ద్వేషిస్తే నీకు దుఃఖం ఏమిటి? ఎవడో ప్రేమిస్తే నీకు ఉద్రేకం ఎందుకు అంటున్నారు ఆచార్యులవారు. ఎక్కడికక్కడ నరికి అవతల పారేస్తున్నారు. అనాత్మగొడవలు ఇంక తీసేయండి. అది మీరు కాదు అన్నప్పుడు ఇంక కౌంటింగు ఎందుకు, తీసేయండి. అది ఆత్మా అనాత్మా, సత్యమా అసత్యమా, అది మనకు ఉపయోగపడుతుందా ఉపయోగపడదా అవి రెండే ప్రశ్నలు వేసుకొని అక్కరలేనివి లాగేయండి, తుడిచేయండి అంతేగాని వివరాలలోనికి వెళ్ళటం ఎందుకు?

ఏసుక్రీస్తు భక్తుడు ఒకడు అంటాడు ఓ ప్రభువా! ఎంత దుఃఖం వస్తే ఎవడికి కావాలి, ఆ దుఃఖాన్నంతా భరించగల శక్తి నువ్వు నాకు ఇచ్చేటప్పుడు ఎప్పటికైనా ఆ దుఃఖమే పోతుంది అన్నాడు. ఏసును వాళ్ళ తల్లి అంటుంది నీకు ఒళ్ళంతా ముళ్ళు గుచ్చేసారు, ముళ్ళకిరీటం పెట్టారు, ఈ బాధ ఎలా భరిస్తున్నావు. యెహోవా నీకు భరించే శక్తిని ఇవ్వకపోతే ఇదంతా నువ్వు ఎలా భరించగలవు అంటుంది. ఆవిడ ఏసు బాధను చూస్తోంది. వాడి బాధను వాడు చూసుకోవటం లేదు. సత్పురుషులు ఎలా ఉంటారో చూడండి. నాకు కొంప లేదు నా తరువాత మా అమ్మ ఏ కొంపలో ఉంటుంది అని వాడు ఆలోచిస్తున్నాడు. అమ్మ ఎప్పుడు చనిపోతుంది అని మనం కనిపెట్టుకొని ఉంటే ఇంక మనం వాళ్ళను ఏమి చూస్తాము. నిన్ను నువ్వు నియమించుకోవాలి. వారు అలా ఉన్నారు మనం అలా ఎందుకు ఉండకూడదు, వీరు ఇలా ఉన్నారు మనం ఇలా ఎందుకు ఉండకూడదు అనుకోవద్దు. భగవంతుడు చెప్పినట్లుగా మనం ఉండాలి, మిగతా గొడవలు వద్దు. భగవంతుడు చెప్పినట్లుగా ఉండలేకపోతే అలా ఉండటానికి మనం ప్రయత్నం మొదలుపెడితే ఆయన దయ వచ్చేస్తుంది. నీ ప్రయత్నం సఫలం అయ్యేలాగ ఆయన దయ నీకు సహకరిస్తుంది. అందుచేత ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు.

ఎవరినీ ద్వేషించవద్దు, మనస్సులో అందరి క్షేమాన్ని కోరుకో. భౌతికంగా సహాయం చేయగల శక్తి నీకు ఉంటే ఇతరులకు నువ్వు చేయగలిగిన సహాయం చెయ్యి. నీకు ఇంట్లో దారిద్ర్యం ఉండవచ్చుగాని మనస్సులో దారిద్ర్యం ఉండకూడదు. నువ్వు ఇలా జీవిస్తూ ఉంటే ఇక్కడే ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే బ్రహ్మానందం వచ్చి నిన్ను వరిస్తుంది. కొంతమంది విషయాలను ఎంజాయ్ చేస్తున్నారు, కొంతమంది డబ్బును ఎంజాయ్ చేస్తున్నారు, కొంతమంది చదువును ఎంజాయ్ చేస్తున్నారు కాని బ్రహ్మంను ఎంజాయ్ చేసేవారు ఈ లోకంలో ఎంతమంది ఉన్నారు. మీ ఆయన మంచివాడు అయినా అది ప్రకృతి గొడవేకదా, డబ్బు కూడా ప్రకృతి గొడవే, చదువు కూడా ప్రకృతి గొడవే. వీటిమీద ఆధారపడిన సంతోషం ఎంతకాలం నిలబడుతుంది. నీ సంతోషం మనోకల్పితం, నీ దుఃఖం మనో కల్పితం. మనస్సు లేకపోతే ఏమీలేదు. ఉన్నది భగవంతుడు ఒక్కడే. ఆ స్మృతి నీకు లేకపోవటం వలన ఇది అంతా నిజం అనుకొంటున్నావు. ఎంతోకొంతస్వార్థం తగ్గించుకొని నువ్వు మంచి పనులు చేస్తూ ఉంటే, చేప ఏవిధంగా అయితే నీటికి ఎదురు ఈదుతుందో అలాగ నీవు మనో ప్రవాహమునకు ఎదురు ఈదుతూ ఉంటే అప్పడు నువ్వు చేసే సాధనకు ఆయనకు సంతోషం కలుగుతుంది, నీ మీద ప్రీతి కలుగుతుంది. భోక్త ఆయనే, నువ్వు చేసిన మంచి పనిని ఆయన భుజిస్తాడు. ఆయన భుజించి ప్రతిఫలంగా నీకు మోక్షాన్ని ఇస్తాడు.

మన అంతర్యామి తప్పించి మన క్షేమం కోరేవాడు ఎవడూ లేడు. సమాజం ఎలా ఉంది అంటే పెట్టిన రోజు పండుగ, ఏ రోజు పెట్టకపోతే ఆ రోజునే తద్దినం ఇదీ పరిస్థితి. ఎంతమంది అహంకారాల్ని మనం సంతృప్తి పరచగలము. ఇక్కడ భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీ క్షేమం కోరేవాడిని నేనే అందుచేత నేను చెప్పిన మాటను జాగ్రత్తగా విను. నీ క్షేమం కోరేవాడు చెప్పినమాట వినకపోతే ఇంక ఎవరిమాట నువ్వు వింటావు. ఓ అర్జునా! నువ్వు యుద్ధం చేయనంటున్నావు. ఈ భీష్ముడిని ఎలా చంపటం, ఈ ద్రోణుడిని ఎలా చంపటం అంటున్నావు. నువ్వు చంపకపోతే మటుకు ఆ శరీరాలు ఎంతకాలం ఉంటాయి. దేహానికి చావు ఉంది. ఆత్మకు చావులేదు, ఆత్మకు వికారాలు లేవు. అటువంటి ఆత్మతో ఈ దేహాన్ని పోలుస్తున్నావు. ఇది ఏమి అపచారం. ఈ గ్రహచారం ఎలా వచ్చి నీ నెత్తిమీద పడింది. నువ్వు వీరందరిని చంపాలని చంపటం లేదు. యుద్ధం వచ్చి నీ నెత్తిమీద పడింది. యుద్ధం చెయ్యటం అనేది నీ డ్యూటీ. ఎవడిపని వాడు చెయ్యాలి. నీ పని ఏదో

నువ్వు చేసెయ్యి ఇందులో పుణ్యపాపములతో నీకు సంబంధం లేదు. మనలో అంతర్యామిగా ఉన్న నారాయణుడే శరీరం ధరించి వచ్చి చెపుతున్నాడు. అది మనం గ్రహించలేకపోతున్నాము. మన క్షేమం కోరేవాడు ఒకడు ఉన్నాడు, ప్రభువు ఉన్నాడు, మనం దిక్కులేని వారము కాదు. నారాయణుడే మనకు పెద్దదిక్కు. భగవంతుడిని మనలో అంతర్యామిగా పెట్టుకొని మాకు దిక్కులేదని అటువంటి బీదమాటలు ఎవరూ మాట్లాడవద్దు. భగవంతుడు చెప్పినమాటలను శ్రవణం చెయ్యండి. శ్రవణం చెయ్యుటమే కాదు మననం చెయ్యండి. ఆయన మాటలను తిరిగితిరిగి అధ్యయనం చెయ్యండి. ఇంటికి వెళ్ళి ఆ మాటలను మనస్సులో రాపాడించుకోవాలి.

మీ కళ్ళు, ముక్కు ఒక అందమా? మీ కాళ్ళు, చేతులు ఒక అందమా? దేవుని దయ మీకు మోక్షాన్ని ఇస్తుంది కదా. దేవుని దయ కంటే మించిన అందంకాని, దేవుని అనుగ్రహం కంటే మించిన సౌందర్యంకాని ఈ లోకంలో ఎక్కడైనా ఉందా అంటున్నారు ఆచార్యుడు. ఈ లోకంలో ఎవరు మనలను విడిచిపెట్టేసినా భగవంతుడు మనలను విడిచిపెట్టడు అనే విశ్వాసం మీకు ఉంటే శాంతి రాకుండా ఎక్కడికి పోతుంది. మీరు విశ్వాసపాత్రులు అయితే శాంతి వచ్చేతీరుతుంది. సబ్జక్టు ఉన్నది ఉన్నట్లుగా మీకు అర్థమవుతూ ఉంటే ఇప్పడే ఇక్కడే ఈ శరీరం మరణించకముందే మీకు శాంతి కలుగుతుంది. బోత్‌సైడ్స్ హేపీనెస్. అటుచూస్తే సుఖం, ఇటుచూస్తే సుఖం. ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే. నువ్వు అజ్ఞానంలో ఉన్నప్పడు ఈ లోకం ఎంతసత్యంగా కనిపించిందో నీకు జ్ఞానోదయం అయ్యాక ఈ లోకం అంత అసత్యంగా ఈ జన్మలోనే నీకు తెలుస్తుంది, పునర్జన్మలు కాదు. ఎంత వండర్‌ఫుల్‌గా ఉంటుందో చూడండి. వైకుంఠం నీకు వద్దు, కైలాసం నీకు వద్దు. నువ్వు పొందుతున్న ఆనందంలో వెయ్యివ వంతు కూడా వారు పొందటంలేదు. అటువంటి ఆనందం, సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఆనందం నీకు అనుభవంలోనికి వస్తుంది ఇంక నీకు వైకుంఠానికి, కైలాసానికి ప్రయాణాలు ఎందుకు? ముందు సబ్జక్టును ఎంజాయ్ చెయ్యండి. వాడు నన్ను ద్వేషిస్తున్నాడు, వాడికి నేనంటే ఇష్టం లేదు ఇలా అనుకొని బాధపడుతూ ఉంటారు. వాడూ నువ్వే అనుకొంటే ఇంక ఏమీలేదు, మనస్సు పడిపోతుంది, ఇంక వికారాలు ఎక్కడ నుండి వస్తాయి. ఈ మాటలు అర్థమయ్యేటప్పడు ఇంక నీకు సాధనతో పని ఏముంది. మీరు రోజూ నిద్రపోయేముందు శివనామంగాని, రామనామంగాని మీకు ఇష్టమైన నామం పదినిమిషాలు చేసుకోండి. అప్పడు నిద్రలో మీకు తెలియకుండానే మీ మనస్సు ఆ మంత్రం చేస్తుంది, అది మీకు అదనంగా వచ్చే లాభం.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# గురు వైభవం

ఆధ్యాత్మిక సాధనా మార్గంలో 'గురువు' యొక్క స్థానము చాలా విశిష్ఠమైనది. ఈ సకల చరాచర సృష్టికి ఆధారంగా ఉన్న అనంత, నిర్గుణ, నిరాకార, సచ్చిదానంద, పరమాత్మ యొక్క సగుణ, సాకార రూపమే దేహధారియైన గురువు. చిదాకాశ స్వరూపుడు, ద్వంద్వాతీతుడు, అజ్ఞాన నాశకుడు, సుజ్ఞాన బోధకుడు గురువు. దేవుడు, గురువు ఏక స్వరూపమే! అందుకే 'గురుదేవుడు' అంటారు. జీవుడు తాను బ్రహ్మమై యుండి, దేహాత్మబుద్ధి కారణంగా జనన, మరణ సంసార సాగరంలో దుఃఖిస్తున్న తరుణంలో, దానిని దాటించి ఒడ్డుకు చేర్చే సాధనమే దయాసాగరుడైన గురువు. సంసార రోగానికి దివ్యౌషధం సద్గురు బోధ. గురుబోధను అందరు వింటారు, కాని శ్రద్ధావంతులు మాత్రమే సారాన్ని గ్రహించగలుగుతారు. బొగ్గుకు నిప్పుయొక్క సంపర్కం కలుగగానే, దానికున్న నలుపురంగు పోయి ప్రకాశించునట్లుగానే, శిష్యునికి సద్గురు సాన్నిహిత్యం లభించగానే అతనిలోని అహంభావనకు అంతం మొదలై చివరకు పరిశు ద్ధుడవుతాడు. గంగాజలం శరీరాన్ని శుద్ధిచేస్తే, గురుబోధ మనస్సును పరిశుద్ధం చేస్తుంది. మన సాధనా జీవితంలో అత్యంత కీలకమైనది సద్గురు కృప. సద్గురు కృప వల్లనే వాస్తవంగా నేనెవరో? తెలియబడి స్వగృహానికి తిరిగి చేరతాం. గురువు తన త్రికరణముల ద్వారా పరమశాంతిని బాహ్యంలోనికి ప్రసరింపజేస్తారు, కాబట్టి ఈ సృష్టికే అద్భుత వరం గురువు.

**చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# దారి చూపే గురువు లేకపోతే - ఎవరైనా అంధులే - 1

కర్మచక్రం నుంచి తప్పించుకోవటాన్ని ఎంతప్రయత్నం చేసినా పరిష్కారం కనిపించదు. చైతన్యంలో జాగృతమైనప్పుడే పరిష్కారం అవుతుంది. మొగ్గ పుష్పంగా మారాలంటే దానికి కొంత సమయం కావాలి. తొందరపడితే రాదు అలాగే కర్మచక్రం నుంచి బయటపడాలంటే గురు అనుగ్రహం కోసం ప్రార్థనాపూర్వకంగా పశ్చాత్తాపంతో, విశ్వాసభరితంగా నిరీక్షించాలి. మనకు తెలుసున్న రీతిలో ఆయన్ని ప్రేమించాలి ఇది ముఖ్యం. ప్రేమకు సాటియైనది మరియొకటిలేదు. గురువు గొప్పదనాన్ని గురించి ప్రచారం కాదు మనం ఉద్ధరించబడాలి. పదిమంది నిద్రపోతూ ఉంటే ఒకరిని పేరుపెట్టి పిలిస్తే ఆయన మాత్రమే లేస్తాడు. అలాగే గురువు విషయంలో అంతే గురునామాన్ని జపిస్తే లేదా ఆ రూపంపై ధ్యానం ఆయన కళ్యాణగుణాలను స్మరిస్తే ఆయన పిలుపు మాటలు వినిపిస్తాయి. గురువు కష్టాలను తొలగించేవాడు కాడు కష్టాలకు ఉనికి లేదని అనుభవం ఇస్తాడు. గురువు మహాత్ముడు కాకపోతే ప్రతీదీ కష్టంగా కనిపిస్తుంది. గురువు ఎవరికి సహాయం చేసినా మరియొకరికి సహాయం చేస్తున్నాను అనుకోడు. మన చెయ్యికు గాయమైతే మందు వేసుకొంటాము ఎవరికో నయం చేస్తున్నాము అనుకోము. అలాగే సర్వాంతర్యామితత్వాన్ని తెలుసుకొన్న గురువు మన బాధలను ఉపశమనం చేసి ఆయన బాధను తీర్చుకొంటారు. ఆచేతనాతత్వం అటువంటిది. అందుకనే శ్రీనాన్నగారితో సాధకులు కష్టాలు తొలగినాయంటే "మీ గురించి ఆలోచించే శ్రమ తగ్గించారు" అంటారు. "కోటి చంద్రులు, కోటి సూర్యులు ఉదయించినా సద్గురువు లేకపోతే అంతా కటిక చీకటే" అంటారు కబీర్. నిర్మల హృదయంతో గురువును ఇలా ప్రార్థించాలి "దేవాదిదేవా నిన్ను రోజు అంతా తలచుకొనేలా చెయ్యి. నా ప్రతీ ఆలోచనా, పని నీకు మరింత చేరువయ్యేటట్లు చేయి. నీ పాదాల మీద భక్తి నాకు కలిగేలా చెయ్యి, నేను మరిచిపోయినా నాకు గుర్తుచెయ్యి ఆ బాధ్యత నీదే. నా మాటలతో ఎవ్వరినీ నొప్పించకుండా ఉండేలా బలం నాకు ఇయ్యి అనాలి. నిజం చెప్పాలంటే శిష్యుడు ఎక్కడ ఉంటాడో గురువు అక్కడే ఉంటాడు. ఇది గురువు సత్తా. గురుతత్త్వం యొక్క గొప్పతనం అది. అది గ్రహించిన సాధకుడు. అనుక్షణం గురువు తనను చూస్తున్నాడని జాగరూకతతో, హెచ్చరికగా భావించి జీవితాన్ని నిర్మలబుద్ధితో నిరహంకారంగా జీవితాన్ని సాగిస్తే గమ్యాన్ని చేరటం నల్లేరుమీద బండినడకగా అవుతుంది. గమ్యాన్ని చేరిపోతాము. అదే గురువు లేకపోతే మనకు తోచిన పనికిమాలిన మార్గంలో ప్రయాణం చేసి గతిని నిరోధించుకొన్న వారమౌతాము. అందుకనే పరమహంసగారు ఒకరితో "ఒరే నేను గీత గీసానురా ఎక్కడికి వెళ్ళగలవు" అంటారు. గురువు నాకు రక్షకుడుగా ఉన్నాడనే విశ్వాసానికి మించిన సాధనలేదు ఇది సత్యం సత్యం - సత్యం. (సశేషం)

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం